క్లుప్తంగా

యువకుల రక్తదానం

శ్రీరాంపూర్: నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీతారాంపల్లిలో టీం యునిటీ యువజన స్వచ్ఛంద సేవా సంస్థ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసింది. ప్రభుత్వ పాఠశాలలో జరిగిన రక్తదాన శిబిరాన్ని శనివారం స్థానిక వార్డు కౌన్సిలర్ సుర్మిళ్ల వేణు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి తలసేమియా వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన నాయకులు పి.రంగారావు, మధుకర్, దేవయ్య, మోహన్‌రావు, వెంకన్న, రెడ్‌క్రాస్ సొసైటీ కోశాధికారి పడాల రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

17న అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన

జైపూర్: మండల వ్యాప్తంగా 20గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల(జీపీడీపీ) తయారీపై ఈ నెల 17న మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–2025ఏడాదికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు తయారు, చేపట్టబోయే అభివృద్ధి పనుల అంశంపై అధికారులతో పాటు ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు, అందరూ తప్పకుండా హాజరు కావాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నెన్నెల: మండలంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కుశ్నపల్లికి చెందిన సైదల సమ్మయ్య, అధ్యక్షుడిగా వేల్పుల రాజశేఖర్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్, కార్యదర్శిగా రాకేష్, సంయుక్త కార్యదర్శిగా చిప్పకుర్తి మహేష్, ఉపాధ్యక్షుడిగా లింగంపల్లి మనోజ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కమిటీని నెన్నెల మండల ఇన్‌చార్జి గోగర్ల శేఖర్, జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, జిల్లా ఇన్‌చార్జి గుండా థామస్, గణేష్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్ర

దండేపల్లి: మండలంలోని మేదరిపేటలో శనివారం మోదీ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన, అమలు చేస్తున్న పథకాలను ప్రచార రథంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా ప్రజలకు వివరించారు. భీమా పథకాలు, పీఎం కిసాన్, ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలను గురించి తెలియజేశారు. బీజేపీ ఎస్సీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జి ముత్తినేని మల్లేష్, బూత్ అధ్యక్షుడు వెంకటేష్, వివిధ శాఖల సిబ్బంది, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

భీమిని: కన్నెపల్లి మండలంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మరుగుదొడ్ల పనులు నాసిరకంగా నిర్మిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణ పనులను శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల్లో వాడుతున్న రాడ్, సిమెంట్ పనులు నాసిరకంగా ఉన్నాయని త్వరగా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్వాలిటీగా పనులు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు డాగయ్య, బాస్కర్, సురేష్, వెంకటేష్, మొండి పాల్గొన్నారు.

పూర్తయిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ

దండేపల్లి: ఎన్నికల హామీలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించేందుకు గత నెల 28నుంచి ఈ నెల 5వరకు ఊరూరా గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి స్వీకరించారు. ప్రజలు అందజేసిన ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో దండేపల్లి మండలంలో మొత్తం 17,624దరఖాస్తులు రావడంతో, వాటన్నింటినీ దండేపల్లి మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బందితో పాటు, ప్రైవేటు ఆపరేటర్లను నియమించి, ఆన్‌లైన్ చేశారు. మండలానికి సంబంధించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ శనివారంతో పూర్తయ్యిందని ఎంపీడీవో మల్లేశం తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలతో పాటు, రేషన్‌కార్డులకు సంబంధించి కూడా సుమారు 600దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో పేర్కొన్నారు.

అంగన్‌వాడీకేంద్రంలో సంబురాలు

భీమారం: మండల కేంద్రంలోని ఇప్పల బొగుడ ప్రాంతం అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి పండుగ సంబురాలను ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పెంద్రి స్వప్న చిన్నారులకు భోగిపండ్లు పోశారు. చిన్నారుల తల్లులు వివిధ రంగులతో సంక్రాంతి ముగ్గులు వేశారు.

పల్లెల్లో పండుగ జోష్..!

- సంక్రాంతిని పురస్కరించుకుని ఊరూరా ఆటల పోటీలు
- హాజీపూర్‌లో సైకిల్ రేస్, పలుచోట్ల క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్లు
- మహిళలకు ముగ్గుల పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజలు
- బహుమతులు ప్రదానం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు



గుడిపేటలో పోటాపోటీగా సాగుతున్న సైకిల్ రేస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటలో సంక్రాంతి వేళ సైకిల్ రేస్ పోటీలు చిన్నారుల్లో ఉత్సాహం నింపడమే కాదు.. ఊరంతా సందడి వాతావరణం నెలకొంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని యువరాజ్యం స్వచ్ఛంధ సంస్థ, హాజీపూర్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం గుడిపేటలో వివిధ విభాగాల్లో నిర్వహించిన సైకిల్ రేస్ పోటీల్లో మండలంలోని పలు గ్రామాల నుంచి దాదాపు 150మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ప్రజాప్రతినిధులు, అధికారులు జెండా ఊపి ప్రారంభించగా దాదాపు రెండు గంటల పాటు సైకిల్ పోటలు పోటాపోటీగా ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు ఎక్కడా తగ్గకుండా వారి సత్తాను, ప్రతిభను చాటేలా పోటీలకు మరింత ఊపు తీసుకొచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్రాంతి పండగ రోజులు ఇలా చిన్నారులకు సైకిల్ పోటీలు ఏర్పాటు చేయడం, కొద్దిపాటి ప్రచారంతో సైకిల్ పోటీలకు జోష్ పెరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సైకిల్ పోటీలు చిన్నారుల్లో కొత్త జోష్‌ను పెంచడమే కాదు వారిలో మానసిక ధైర్యాన్ని నింపుతుందని, ముఖ్యంగా ఆరోగ్య పరంగా దోహదపడుతుందని అన్నారు. టీవీలు, సెల్‌ఫోన్‌లు వదిలి ఇలా మైదానాల్లోకి వచ్చి ఆటల్లో భాగస్వామ్యమైతే భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందని తెలిపారు. ఇక పోటీల అనంతరం గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలకు నగదు ప్రోత్సాహాలతో పాటు పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ పతకాలను అందజేశారు. సైకిల్ పోటీల్లో ఎంపీపీ స్వర్ణలత, ఎంపీటీసీ ఒడ్డె బాలరాజు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్రీనివాసగౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట రవి, సీనియర్ నాయకుడు పూస్కూరి శ్రీనివాసరావు, నాయకులు బేర పోశం, కందుల రమేష్, అత్తె శ్రీనివాస్, హాజీపూర్ ఏఎస్సై చాంద్‌పాషా చేతుల మీదుగా బహుమతులు ప్రదానోత్సవం చేశారు. 1, 2 తరగతుల విభాగంలో ప్రథమ స్థానంలో కొత్తపల్లి ఆశిక్(గుడిపేట), ద్వితీయ స్థానంలో ఎనగందుల విశాల (నంనూర్), 3, 4 తరగతుల విభాగంలో ప్రథమ అదనాన్(గుడిపేట), ద్వితీయ చిప్పకుర్తి స్నేహిత్ వర్మ(గుడిపేట), 5, 6 తరగతుల విభాగంలో ప్రథమ గోపవు చరణ్‌కుమార్(గుడిపేట), ద్వితీయ తిప్పని రాంఅఖిల్(గుడిపేట), 7, 8 తరగతుల విభాగంలో ప్రథమ గోపు మహేశ్(గొల్లపల్లి), ద్వితీయ పి.రిషి(ధర్మారం), 9, 10 తరగతుల విభాగంలో ప్రథమ మహేంద్రపు శివచరణ్‌తేజ(గుడిపేట), ద్వితీయ స్థానం గెల్లు సిద్దు(గొల్లపల్లి) లు విజేతలుగా నిలవగా మొదటి విజేతలకు రూ.2వేల చొప్పున, ద్వితీయ విజేతలకు రూ.వెయ్యి నగదు చొప్పున ప్రోత్సాహకాలను అందజేశారు. పీఈటీలు దేవేందర్, రవి, సంతోశ్, యువరాజ్యం స్వచ్ఛంధ సేవా సంస్థ సభ్యులు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది..



ఊర్లో సైకిల్ పోటీలు అనగానే సంతోషంతో వచ్చి పాల్గొన్నా. నేను మొదటిసారి ఈ పోటీల్లో పాల్గొనడంతో ఆనందంగా ఉంది. అందులో ప్రథమ స్థానంలో నిలిచి రూ.2వేల నగదు ప్రోత్సాహం, పతాకాన్ని అందుకోవడంతో అంతా సంబురాల్లో మునిగిపోయాం. చేతుల్లో సెల్‌ఫోన్, పుస్తకాలు వదిలి ఇలా పండగ వేళ సైకిల్ తొక్కడం భలే సరదాగానే కాదు హుషారుగా ఉంది.

– మహేంద్రపు శివచరణ్‌తేజ, గుడిపేట



ట్రాలీ ఆటోపై తీసుకువస్తున్న సైకిళ్లు



విజేతలతో ప్రజాప్రతినిధులు, అధికారులు

యువకులు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

- బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ
- అట్టహాసంగా ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విన్నర్స్‌గా నిలిచిన ఫ్రెండ్స్ లెవెన్ జట్టుకు నగదు బహుమతి అందిస్తున్న ఆర్డీవో,నిర్వాహకులు

బెల్లంపల్లి: యువకులు క్రీడలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతరి స్వామి అన్నారు. బెల్లంపల్లి ఏఎంసీ క్రీడామైదానంలో ఎన్ఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న ప్రారంభించిన అసెంబ్లీ నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం అట్టహాసంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. క్రీడలపై ప్రస్తుత తరం యువకులు అధిక ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. ఆసక్తిని పెంచుకుని క్రీడల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. క్రీడాకారులకు తనవంతు సహకారం ఎప్పుడూ అందిస్తానని నాతరి స్వామి అభయం ఇచ్చారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కె.రాంచందర్ మాట్లాడుతూ..క్రికెట్ టోర్నమెంట్ నిర్వహణలో నాతరి స్వామి క్రీడాకారులకు అందించిన ప్రోత్సాహం మరువ లేనిదన్నారు. ఎంతో వ్యయ ప్రయాసాలకోర్చి క్రికెట్ పోటీలను విజయవంతం చేశారని పేర్కొన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ పోటీలు యువకుల్లో ఎంతో ఉత్సాహాన్ని నింపాయని తెలిపారు. ము న్ముందు ఇదేమాదిరిగా క్రీడా పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఉత్తేజ పర్చాలని సూచించారు.

టోర్నమెంట్ విజేత ఫ్రెండ్స్ లెవెన్ జట్టు

అసెంబ్లీ నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీల్లో 24టీమ్‌లు పాల్గొన్నాయి. వీటిలో ఫ్రెండ్స్ లెవెన్, మార్నింగ్ వాకర్స్ టీమ్‌లు ఫైనల్‌కు చేరాయి. వీటి మధ్య ఫైనల్ మ్యాచ్ నువ్వానేనా అనే రీతిలో జరిగింది. ఇరు జట్ల క్రీడాకారులు హోరాహోరీగా తలపడగా చివరికి ఫ్రెండ్స్ లెవెన్ జట్టు విన్నర్స్‌గా నిలవగా, మార్నింగ్ వాకర్స్‌జట్టు రన్నర్స్‌తో సరిపెట్టుకుంది. విన్నర్స్‌గా నిలిచిన జట్టుకు రూ.44,444, రన్నర్స్ జట్టుకు రూ.22,222 నగదు బహుమతి, ట్రోఫీని ఆర్డీవో హరికృష్ణ, టోర్నమెంట్ నిర్వాహకుడు నాతరి స్వామి అందజేశారు. అనంతరం టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహించిన నాతరి స్వామిని ముఖ్య అతిథులు శాలువా కప్పి గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజకీయపార్టీలు, అనుబంధ, ప్రజా సంఘాల నాయకులు సమ్మయ్య, టీ.మల్లేష్, బి.రవి, వెంకటేష్, మహేష్, థామస్, రాజలింగు, శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సారంగపల్లిలో నియోజకవర్గస్థాయి క్రికెట్ పోటీలు

మందమర్రిరూరల్: మండలంలోని సారంగపల్లిలో క్రీడాప్రాంగణంలో సారంగపల్లి అంబేద్కర్ విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ గ్రామీణస్థాయి కాకా వెంకటస్వామి మెమోరియల్ క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు హాజరై ప్రారంభించారు. ఈ పోటీల్లో 20జట్లు పాల్గొంటున్నాయని, గెలిచిన జట్టుకు రూ.20వేలు, రెండో బహుమతిగా రూ.10వేలు నగదు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమలమనోహర్‌రావు, రాయమల్లు, చంద్రకళ, రాములు, నిర్వాహకులు చిప్పకుర్తి శ్రీనివాస్, బచ్చలి ప్రవీణ్, కుమారస్వామి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఓదెలు

క్రీడల్లో గెలుపోటములు సహజం

లక్సెట్టిపేట: క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో శనివారం బీజేపీ నాయకులు ఏర్పాటు చేసిన కబడ్డీ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. సెలవుల్లో క్రీడలపై దృష్టి పెట్టాలని, క్రీడా పోటీలలో పాల్గొనే క్రీడాకారులు ఆత్మస్థైర్యాన్ని కలిగి ఉంటారన్నారు. గెలుపు, ఓటమి సహజమని ప్రతి ఒక్కరూ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. విజేత అయిన బజరంగ్ జట్టు క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, మండల నాయకులు హరిగోపాల్, మధు, కిషన్, జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభాకర్, శివశంకర్, పాంచాల రమేష్, గంగన్న పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న హరీశ్‌బాబు

నాయకపుగూడలో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

కాసిపేట: మండలంలోని దేవాపూర్, నాయకపుగూడలో స్వర్గీయ రొడ్డ చిన్న రమేష్ జ్ఞాపకార్థం ఆదివాసీ నాయకపుపోడ్ సేవా సంఘం, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభించారు. ఆదివాసీల తరపున రమేష్ చేసిన సేవలను కొనియాడారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని తెలిపారు. ఈ టోర్నీలో మొత్తం 20జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో దేవాపూర్ మద్దిమాడ సర్పంచ్‌లు అనంతరావు, ఆడ జంగు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణరెడ్డి, నాయకపుపోడ్ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి బాపు, మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఆదివాసీ నాయకులు, సర్పంచులు

నేడు దొనబండలో ముగ్గుల పోటీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ గ్రామంలో స్థానిక మహిళలు, యువతులకు ఆదివారం సంక్రాంతి పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందే విజేతలకు మొదటి బహుమతి రూ.రెండు వేలు, రెండో బహుమతి రూ.1,500, మూడో బహుమతిగా రూ.వెయ్యి అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఉదయం 10గంటల లోపు దొనబండ ప్రభుత్వ పాఠశాల మైదానంలోకి ఎవరి ముగ్గులకు సంబంధించి కలర్లు, ఇతర అవసరాలను వెంట తీసుకొచ్చుకోవాలని సూచించారు.

చెన్నూర్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం

చెన్నూర్: క్రీడలతో శారీరక దృఢత్వం పెంపొందుతుందని మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ మూల రాజిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శనివారం మాజీ ఎంపీ స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) స్మారక క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నూరి శ్రీధర్, బషీరోద్దిన్, చెన్న సూర్యనారాయణ, పాతర్ల నాగరాజు, మహేశ్, సుల్తాన్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



హాజీపూర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు ప్రోత్సాహాలను జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, స్రవంతి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి, నాయకులు ధర్మయ్య, సత్యం, స్వామిరెడ్డి, తిరుపతి, రాజు పాల్గొన్నారు.

పొన్నారంలో..

మందమర్రిరూరల్: మండలంలోని పొన్నారంలో గ్రామస్తుడు దొండ సంపత్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా పలువురిని ఆకట్టుకున్నాయి. బాలికలు, యువతులు, మహిళలు 44మంది పాల్గొని ముగ్గులు వేశారు. ప్రవళిక మొదటి, సుప్రియ రెండో, రజిత మూడో బహుమతి సాధించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ గెలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.



బహుమతి ప్రదానం చేస్తున్న ఎస్సై

పల్లవి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తా సమీపంలో గల పల్లవి ఆసుపత్రిలో అరుదైన ఆపరేషన్లు విజయవంతం చేస్తున్నట్లు ఆసుపత్రి వైద్యుడు బి.రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా వంకర కాళ్లతో బాధపడుతున్న వారికి, ప్రమాదాల్లో తీవ్ర గాయాలపాలై కాలు తీసేస్తే గాని వారి ప్రాణాలు నిలవలేని పరిస్థితుల్లో ఉన్న రోగులకు పల్లవి ఆసుపత్రిలో ఇలిజారోవ్ ఫిక్సేషన్ పద్ధతిని అనుసరించి అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల రోజుల వ్యవధిలో ఇలిజారోవ్ ఫిక్సేషన్ ద్వారా కన్నెపల్లి మండలానికి చెందిన దుర్గమ్మ, బొక్కల గుట్ట గ్రామానికి చెందిన తిరుపతి, సీసీసీ నస్పూర్‌కు చెందిన అంజమ్మ, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణికి చెందిన లక్ష్మీనారాయణ అనే రోగులకు ఆపరేషన్లు విజయవంతం చేసినట్లు ఆయన తెలిపారు. ఇలాంటి ఆపరేషన్లకు రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని, కానీ పల్లవి ఆసుపత్రిలో అతి తక్కువ ఖర్చుతో ఆపరేషన్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అనంతరం ఆసుపత్రి పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ సాయి శృజ మాట్లాడుతూ.. పుట్టుకతో వంకర కాళ్లతో ఉన్న పిల్లలకు ఎదిగే దశలో ఎముకలు వంకరగా మారిన పిల్లల కాళ్లను ఇలిజారోవ్ ఫిక్సేషన్ ద్వారా సరి చేయవచ్చని ఆమె తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ అనంతరం రోగులతో డాక్టర్లు బి.రాజు, సాయి శృజ



ఘనంగా గోదాదేవి కల్యాణం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాధుల కల్యాణం ఆలయ అర్చకులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, నరసింహాచార్యులు కనుల పండువగా జరిపించారు. కల్యాణానికి ఏరియా జీఎం దంపతులు మనోహర్ సవిత, అధికారులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.

అక్షింతలతో శోభాయాత్ర



గొల్లపల్లిలో శోభాయాత్రలో భక్తులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరామ పూజిత అక్షింతలు శనివారం హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామ పంచాయతీలోని గొల్లపల్లికి చేరగా స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలికి గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికీ వెళ్తూ అక్షింతలతో పాటు శ్రీరామ మందిర పటం, కరపత్రాలు అందజేశారు.

దండేపల్లి: మండలంలోని కొండాపూర్‌లో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. మంగళహారతులు, నృత్యాల మధ్య ఇంటింటికీ వెళ్లీ పంపిణీ చేశారు.

కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు



కార్మికులకు సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలటౌన్: పారిశుధ్య కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు అన్నారు. మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపల్ కార్మికులకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతలో మంచిర్యాలను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలపాలన్నారు. వార్డు సమస్యలను తెలుసుకోవడానికి పౌరసమాజ కమిటీలు వేస్తున్నట్లు తెలిపారు. ఆ కమిటీ సభ్యులు పారిశుధ్యం విషయంలో సంతృప్తి చెందితేనే కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. సక్రమంగా విధులు నిర్వర్తిస్తే హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో వేతనాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. కార్మికులకు యూనిఫాంతో పాటు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. పనిలో మాత్రం అశ్రద్ధను సహించనని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యాలు, వ్యక్తిగత పనుల్లో ఎవరు అవినీతికి పాల్పడినా, వారికి శత్రువు అవుతానని హెచ్చరించారు. కార్యక్రమంలో కాబోయే మున్సిపల్ చైర్మన్ డాక్టర్ రావుల ఉప్పలయ్య, కాబోయే వైస్ చైర్మన్ సల్ల మహేష్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సునీల్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మామిడి శెట్టి వసుంధర, వార్డు కౌన్సిలర్ మాదంశెట్టి సత్యనారాయణ, ఇతర వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అన్నదానం, పండ్లు పంపిణీ

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ స్వచ్ఛంద సేవ సంస్థ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులు లయన్ మెల్విన్ జోన్స్ జన్మదినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులు పట్టణంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో 150మంది గర్భిణులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ మంచిర్యాల అధ్యక్షుడు లయన్ బాలాజీ మాట్లాడుతూ.. లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకులు జన్మదినం, సీనియర్ లయన్ మెంబర్ లయన్ పి.హన్మంతరావు మనుమడు విహాన్ పుట్టిన రోజు సందర్భంగా 200మందికి మాతా శిశు కేంద్రానికి వచ్చిన వారికి అన్నదానం చేసినట్లు తెలిపారు. బ్రెడ్స్, పండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం చైర్‌పర్సన్ పి.హన్మంతరావు, సీనియర్ లయన్ మెంబర్స్ లయన్ వి.మదుసూధన్ రెడ్డి, వి.వినయ్‌కుమార్, లయన్ తిరుపతి రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.